


బాబాకి భక్తులు, ఆయన్ని ఆదరించి సేవించి తరించే ప్రజలు కోకొల్లలు కాసాగారు రోజు రోజుకీ. జనాదరణ ఎక్కువయి బాబా ఎప్పుడూ భక్తుల, ప్రజల మధ్యే ఉండటం ఒక యోగి చూసి సహించలేక నానాటికి అతని పలుకుబడి, అతనిపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లడం, తనపై భక్తి, నమ్మకం పూర్తిగా లోపించడం చూసి సహించలేక బాధపడిపోసాగాడు. తనో గురువులా చెప్పుకోటానికి నలుగురు శిష్యులు మాత్రం అతనికి మిగిలారు.

అందుకే అతనికి బాధ, ఈర్ష్య ఎక్కువయి ఎలాగయినా బాబామీద కక్ష తీర్చుకోవాలనుకున్నాడు. శాశ్వతంగా బాబా బాధ వదిల్చి, ఆ భక్తులందరినీ తనవైపుకు తిప్పుకోవాలనే తలంపు కలిగి రాత్రి పగలూ బాగా ఆలోచించి ఓ పథకం వేసాడు.

ఒకరోజు ఓ పాములవాడ్ని పిలిచి, ''ఒరేయ్ అబ్బాయ్! నీకు కావలసినంత డబ్బు యిస్తాను. నేను చెప్పే పని చెయ్యాలి. చేస్తావా?'' అని అడిగాడు.

దానికి వాడు ఆనందంగా ''ఓ అలాగే స్వామీ'' అన్నాడు.

అంతే - అతను చెవిలో ఏదో చెప్పాడు. ఆ పాములవాడు ముందు భయపడినా, డబ్బు కాశపడి ''ఓ అలాగే చిటికలో చేసేస్తా. ఈ రోజు రాత్రికే ఈ పని పూర్తిచేసేయనూ'' అన్నాడు ఆ స్వామి యిచ్చిన డబ్బు తీసుకుని ఆనందంగా వెళ్తూ.

జి. రామలక్ష్మి, హైద్రాబాదు

ఆ రాత్రి ఓ కోడెనాగును తెచ్చి బాబా పడుకున్న చోట కసిగా ఒక్కటేసి దాన్ని వదిలాడు. దానికి ఆ దెబ్బతో బాగా కోపం వచ్చి, చరచరా పాకుతూ బాబా ఉన్న చోటుకి వచ్చి పడగవిప్పి ఓ నిమిషం చూసి, నమస్కరించి - ఆ తర్వాత అన్నంత వేగంలోనూ చరచరా పోయి క్షణాలలో ఆ రాత్రికిరాత్రే ఆ స్వామీజీని కరిచేసింది.

అతడు ''అమ్మో, బాబో'' అంటూ ఏడుస్తూ మందుకీ, మంత్రానికీ అన్నిచోట్లా ప్రయత్నించి ఆఖరికి ఎవరూ దొరకక బాగా బుద్ధి తెచ్చుకుని, లెంపలేసుకుని తన కుళ్ళు ఆలోచనకి తానే పశ్చాత్తాపపడుతూ వెళ్ళి బాబా పాదాలపై వాలాడు.

బాబా చిరునవ్వుతో అతనికి మందేసి తగ్గించి, కుదుటపడి ప్రాణం నిలిచాక, ''ఎవరు తీసుకున్న గోతులు వారికే ఉపయోగపడతాయి నాయనా. చేతనైతే సాయం, ఉపకారం, దానం, మంచితనం, మంచిమాట పంచి ఇవ్వాలి ఇతరులకి! లేదా బుద్ధిగా ఊరుకోవాలి. ఇలాంటి పనులకిపోతే ఎవరికివారే అనుభవించాలి. జరిగిన దానికి ఇకనైనా బుద్ధి తెచ్చుకుని హాయిగా ఉండు'' అన్నారు.

అతను లెంపలేసుకుని ''బాబా మేమూ మీతోనే ఉంటాము'' అన్నాడు.

ఆనాటినుంచి అతను, అతని శిష్యులు బాబా చెంతన హాయిగా ఉండిపోయారు. బాబా అందరినీ సమంగా ఆదరిస్తారు. ఆయన 'ఆదరణ'లో లోపం ఉండదు. భక్తులంతా ఆయనకి సమానమే.

